క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీనారాయణుడి కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఎం.కోడూరు లక్ష్మీనారాయణ స్వామి

మాడుగుల రూరల్ : మండలంలోని ఎం.కోడూరు గ్రామంలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి 33వ వార్షిక కల్యాణోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. గత ఆరు రోజుల నుంచి జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పల్లకీ సేవ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 8 వరకు జరిగే ఉత్సవాల్లో చక్రస్నానం, నాగవల్లి సంబరాలు, పుష్పాంజలి సేవ, పవళింపు సేవ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పింఛన్ సొమ్ము తగ్గించారంటూ ఫిర్యాదు

రావికమతం : తమ గ్రామ వలంటీర్లు ఈ నెల పింఛన్ సొమ్ములో కోత విధించి, తక్కువ పింఛన్ నగదు అందించారంటూ కన్నంపేట గ్రామానికి చెందిన పలువురు పింఛన్‌దారులు ఎంపీడీవో వెంకన్నబాబుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆ గ్రామంలో వారం రోజుల్లో భక్తాంజనేయ ఉత్సవాలు జరగనున్నాయి. అయితే పండగ విరాళంగా తమకు చెప్పకుండానే ఒక్కొక్కరి పింఛన్లో రూ.వెయ్యి నుంచి రూ.1,500 కోత విధించారని ఆరోపించారు. ఇదేమని అడిగితే మందలిస్తున్నారని పింఛన్‌దారులు దంట్ల శ్రీరామ్‌కోటి, బంటు రామకృష్ణ, జగ్గారావు తదితరులు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎంపీడీవో వారికి హామీ ఇచ్చారు.

తాటిపర్తిలో ఫ్యామిలీ ఫిజీషియన్

మాడుగుల రూరల్ : కేజే పురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో తాటిపర్తి గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 100 మందికి వైద్య సేవలు అందించారు. వైద్యాధికారి యల్.శివప్రసాదుపాత్రుడు గిరిజన సంక్షేమ బాలికలు, ఆశ్రమోన్నత బాలికల పాఠశాలల్లో విద్యార్థినులను పరీక్షించారు. అలాగే దీర్ఘకాలిక రోగుల్ని ఇంటింటికీ వెళ్లి పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో రవికుమార్, హెచ్‌వీ పుష్పకాంతం, ఇతర వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొలువుదీరిన దేవతామూర్తులు



వేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో అమ్మకానికి ఉంచిన దేవతామూర్తుల విగ్రహాలు

బుచ్చెయ్యపేట : ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో సకల దేవతామూర్తుల విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. ఉత్సవాల్లో భాగంగా కొంతమంది వ్యాపారులు రోడ్లకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకుని, శ్రీకృష్ణుడు, విష్ణువు, ఈశ్వరుడు తదితర దేవతామూర్తులతోపాటు అలంకరణ విగ్రహాలను విక్రయానికి ఉంచారు. ఒకే చోట వివిధ రకాల దేవతామూర్తుల విగ్రహాలు మిరుమిట్లు గొలిపే రంగులతో అందంగా తీర్చిదిద్ది ఉంచడంతో పలువురు తమకు ఇష్టమైన విగ్రహాలను కొనుగోలుచేసి, ఇంటికి తీసుకెళ్తున్నారు.

అన్ని దానాల్లో అన్నదానం మిన్న



వడ్డాదిలో అన్నప్రసాదం వడ్డిస్తున్న భక్తులు

బుచ్చెయ్యపేట: అన్ని దానాల్లో అన్నదానం మిన్న అని వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త దొండా కన్నబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావులు అన్నారు. ఈ నెల 3 నుంచి 8 వరకు వడ్డాది వేంకటేశ్వర స్వామి 150వ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా వచ్చే వేలాది భక్తులకు వేంకటేశ్వరస్వామి అన్నదాన సేవా సభ్యులు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు.సుదూర ప్రాంతాల నుంచి స్వామి దర్శనానికి ఉపవాసంతో వస్తున్న భక్తులకు దర్శనం అనంతరం వారి ఆకలి తీర్చడం సంతృప్తిగా ఉందన్నారు.

భూ సర్వే లోపాల సవరణకు వారం గడువు

సిబ్బందికి ఆర్డీవో జయరాం ఆదేశాలు

రోలుగుంట : భూ సర్వేలో లోపాలుంటే వారంలోపు సరిచేసుకోవాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. మండలంలో జరుగుతున్న వైఎస్సార్ భూ రీసర్వే కింద తొలి విడత, రెండవ విడతకు సంబంధించిన సర్వే వివరాలపై చర్చించారు. దీనిపై తహసీల్దార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తొలివిడతలో ఆరు రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తయిందని, రెండవ దశలో ఐదు రెవెన్యూ గ్రామాల్లో సర్వే జరుగుతోందని తెలిపారు. సర్వేల్లో కొన్ని చోట్ల తప్పులు దొర్లాయన్న విషయాన్ని ఆర్డీవో వద్ద విలేకరులు ప్రస్తావించగా తప్పులు సవరించేందుకు అవకాశం ఉందన్నారు. వాటికి సంబంధించిన ఆధారాలతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వచ్చే సోమవారంలోగా సమర్పించి, లోపాలను సవరించుకోవాలని సూచించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

స్పందన ఫిర్యాదులపై సత్వర చర్యలు

నర్సీపట్నం : స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. మొత్తం 27 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుల్ని పరిష్కరించటంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఒకే సమస్యపై ప్రజలు మళ్లీ రావాల్సిన పనిలేకుండా సిబ్బంది తమ విధుల్ని నిర్వర్తించాలని సూచించారు. స్పందనకు వచ్చిన అర్జీల్లో ఎక్కువగా భూసంబంధిత సమస్యలున్నాయి.

- నర్సీపట్నం మండలం, వేములపూడి పంచాయతీ మహిళా పారిశుధ్య కార్మికులు తమకు 16 నెలలుగా జీతాలు అందట్లేదని, పంచాయతీ కార్యదర్శిని అడిగితే తనకు తెలియదంటున్నారని ఆర్డీవోకు మొరపెట్టుకున్నారు.
- పొలాల్లోకి ఉపాధి హామీ పథకంలో రహదారి నిర్మిస్తుండగా కొందరు వ్యక్తులు అడ్డుకుంటున్నారని, రహదారి సౌకర్యం లేక 200 మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని రైతు పి.సన్యాసినాయుడు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.
- సాగు భూమికి హక్కు పట్టా ఇప్పించాలని కోరుతూ కోటవురట్ల మండలం, జల్లూరు గ్రామానికి చెందిన చిటికెల అప్పలనాయుడు అర్జీ పెట్టుకున్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి

ఊరూ వాడా జోరుగా శాసన మండలి ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచార కరపత్రాలతో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ పార్టీ శ్రేణులకు సూచించారు. సోమవారం ఆయన మండలం, పట్టణ పరిధిలో పర్యటించి విస్తృత ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులను సమావేశపరచి గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి పార్టీ బలపరచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి మొదటి ప్రాధాన్యతా ఓటును వేసేలా అభ్యర్థించాల్సిందిగా సూచించారు. ఈ ఎన్నికల ద్వారా ప్రజలకు, ఈ ప్రాంతానికి మేలు జరగాలంటే అధికార పార్టీ అభ్యర్థిని గెలిపించాల్సిన ఆవశ్యకతను వారికి వివరించాలన్నారు. ఆయా గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ ఓటును సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ కోన చంద్రరావు, చోడవరం ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు జ్యోతుల రమేష్, వెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కందర్ప రమేష్‌లు పాల్గొన్నారు.

నర్సీపట్నం : స్థానిక ప్రైవేట్ కళాశాలల్లో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. సీఎం బలపర్చిన సుధాకర్‌కు ఓటు వేయాలంటూ బ్యాలెట్ పేపరు చూపించి ఓటర్లను కోరారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, కౌన్సిలర్లు కోనేటి రామకృష్ణ, మాకిరెడ్డి బుల్లిదొర, పార్టీ పట్టణ అధ్యక్షులు ఏకా శివ, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనివాస్, కనకదుర్గ టెంపుల్ చైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, చింతకాయల వరుణ్, యాదిగిరి శేషు పాల్గొన్నారు.

సుధాకర్‌కే తొలి ప్రాధాన్యతా ఓటు

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక విభాగం క్రియేటివ్ హెడ్, సినీనటుడు ఎల్.జోగినాయుడు సంయుక్తంగా నర్సీపట్నంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలికల గురుకుల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, అటవీ కార్యాలయం, పోలీసు, ఎస్‌ఈబీ స్టేషన్లు, అర్అండ్‌బీ, ఇరిగేషన్, ఏరియా ఆస్పత్రి అధికారులు, సిబ్బందిని కలిసి వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు



ప్రైవేట్ ఉపాధ్యాయులకు బ్యాలెట్ పేపరు అందించి ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే గణేష్

వేయాలని కోరారు. సన్యాసిపాత్రుడు, జోగినాయుడు బ్యాలెట్ పేపరును చూపించి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించి, సంక్షేమ



వేచలంలో పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తున్న ఈర్లె అనురాధ

ప్రభుత్వాన్ని బలపర్చాలని కోరారు.

దేవరాపల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతిచ్చిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి ఉత్తరాంధ్ర అభివృద్ధికి బాటలు వేద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ అన్నారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, పార్టీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడులతో కలిసి వేచలం, ఎం.అలమండ, కొత్తపెంట, ములకలాపల్లి, ఎన్‌జీ నగరం తదతర గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగిరెడ్డి శతారినాయుడు, రొంగలి వెంకటరావు, గొర్లె కొండలరావు, దాడి జగన్, చింతల సత్య వెంకటరమణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బండారు ప్రసాదరావు, ఎంపీటీసీలు పోతల వెంకటరావు, మజ్జి దేవి పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఉత్తరాంధ్ర పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాలని కె.కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ ఓటర్లను కోరారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులు, సచివాలయ ఉద్యోగులను కలిసి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించేందుకు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ పార్టీ శ్రేణులు సోమవారం గ్రామాల్లో వేర్వేరుగా ప్రచారం చేపట్టారు. ఒమ్మలి పీఏసీఎస్ అధ్యక్షుడు బొడ్డావు భాస్కరరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. వీజీ అగ్రహారం పీఏసీఎస్ అధ్యక్షుడు కోరుకొండ చెల్లంనాయుడు ప్రచారం చేశారు.



ఓటు కోసం డిగ్రీ కళాశాల లెక్చరర్లను అభ్యర్థిస్తున్న సన్యాసిపాత్రుడు, సినీనటుడు జోగినాయుడు

నాతవరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం జగన్‌మోహన్ రెడ్డికి గిఫ్ట్‌గా ఇవ్వాలని రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి క్రియేటివ్ హెడ్ లోకవరపు జోగినాయుడు అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని కాలేజీలు స్కూళ్లలోఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన సదస్సు విజయవంతం కావడంతో దేశమంతా సీఎం జగన్ వైపు చూస్తుందన్నారు. సీఎం కృషి వల్లే రూ.లక్షల కోట్లతో పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు కుదిరాయన్నారు. ఆయన ఆలోచనలు, ఆశయాల అమలుకు మరింత ప్రోత్సహించేలా ఎమ్మెల్సీలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన నాయకులు చెప్పే మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, మండల పార్టీ అధ్యక్షుడు పైల పోతురాజు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు చెక్కా జోగిరాజు పాల్గొన్నారు.

మాడుగుల : నియోజకవర్గ కేంద్రం మాడుగులలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదేశాల మేరకు ఎంపీపీ వేమవరపు రామధర్మజ, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావులు ఆదివారం ఇంటింటికీ తిరిగి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ పార్టీ బలపరచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాల్సిందిగా పట్టభద్రులను అభ్యర్థించారు. ప్రచారంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీలు పాలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ సభ్యులు షేక్ ఉన్నీసా, వార్డు సభ్యులు శీలామంతులు జ్యోతి, పార్టీ నాయకులు శేనాపతి గంగాధర్, పాలిమేర చిన్నారావు, కుక్కర మోదకొండ, పుట్టా మురళి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గాదిరాయి గ్రామంలో వైస్ ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకటరాజారామ్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గాదిరాయి, ఒమ్మలి, వీరనారాయణం జెడ్పీ హైస్కూళ్లకు వెళ్లి పార్టీ బలపరచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాల్సిందిగా ఉపాధ్యాయులను అభ్యర్థించారు.

మాకవరపాలెం : ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని తూటిపాలలో సర్పంచ్ గవిరెడ్డి ప్రసాదరావు ప్రచారం నిర్వహించారు. గ్రామంలో సోమవారం రాత్రి పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు రుత్తల రాజు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రుత్తల

మాకవరపాలెం : వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు శాఖల వారీగా ప్రగతిని వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివారెడ్డి మాట్లాడుతుండగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అడ్డుతగిలారు. జల్ జీవన్ మిషన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆక్షేపించారు. దీనివల్ల వచ్చే వేసవిలో ప్రజలకు తాగునీరు పూర్తిస్థాయిలో అందే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. శెట్టిపాలెంలో తాగునీటి పథకం నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అల్లు రామునాయుడు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బూరుగుపాలెం ఎంపీటీసీ సభ్యుడు ఆర్.యర్రాపాత్రుడు మాట్లాడుతూ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రుత్తల సత్యనారాయణ

అన్‌రాక్ నిర్వాసితులకు పంపిణీ చేయాల్సిన రెండు సెంట్ల స్థల సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వేసవిలో ఏ గ్రామంలోనూ తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రుత్తల లక్ష్మి, రాజారావు, ఎంపీడీవో అరుణశ్రీ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పోశాపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

‘ప్రజా ధనాన్ని దోచిపెడుతున్న మోదీ’

చోడవరం రూరల్: భారతదేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసీ, ఎస్‌బీఐలకు చెందిన ప్రజాధనాన్ని ప్రైవేటు వ్యక్తి అయిన అదానీకి ప్రధాని మోదీ దోచిపెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు సోమవారం ఇక్కడి ఎల్ఐసీ, ఎసీబీఐ బ్రాంచి కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టారు. ప్రజాధనాన్ని దోచిపెడుతున్న మోదీ వైఖరి నశించాలి, ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలి అంటూ నినాదాలు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలు గూనూరు వెంకటరావు, ఐ.ఆర్.గంగాధర్, కూండ్రపు అప్పారావుల సారథ్యంలో జరిగిన ఈ నిరసన అనంతరం పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి కొణతాల శ్రీనివాసరావుకు ఓటు వేసి గెలిపించాలని



ఎల్ఐసీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నిరసన

కోరుతూ పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు జంపా నాగేష్, ప్రధాన కార్యదర్శి పూడి శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు పల్లా వెంకటేష్, దళిత నాయకుడు పడవల చక్రవర్తి పాల్గొన్నారు.

దళిత యువకుడి హత్యకు నిరసనగా రాస్తారోకో

నర్సీపట్నం : పాయకరావుపేట మండలం, పి.ఎన్.పురంలో జరిగిన దళిత యువకుడు నాగేంద్ర హత్యను నిరసిస్తూ సోమవారం దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆర్డీవో కార్యాలయం ఎదురుగానున్న మెయిన్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ముందుగా అబిడ్‌సెంటర్లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. అక్కడి నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని రాస్తారోకో చేపట్టారు. దోషులను కఠినంగా శిక్షించాలంటూ దళిత ఐక్యవేదిక నాయకులు ఆర్డీవో హెచ్.వి.జయరాంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు చిట్ల చలపతిరావు మాట్లాడుతూ దళిత యువకుడిని హత్య చేసిన దోషులను తక్షణమే అరెస్టు చేయాలన్నారు. నిందితులను అరెస్టు చేయటంలో పోలీసులు



రాస్తారోకో చేస్తున్న దళిత ఐక్యవేదిక నాయకులు

తాత్సారం చేయటం తగదన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఆరుగుల్ల రాజుబాబు, మార్తి అప్పలరాజు, యర్రంశెట్టి పాపారావు, గాతాడ సహదేవు, యాదగిరి దాసు, కిడారి మల్లేష్, చవల నాగేశ్వరరావు, ఏనుకూరి పాపారావు, తమ్మిలి అప్పారావు, చిట్ల చిన నూకరాజు, చిట్ల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

‘ఆ గ్రామాల్లో మరోసారి భూ సర్వే’



సర్వే, రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ మహేశ్వరరావు

రావికమతం : మండలంలో తొలి దశలో భూ రీసర్వే జరిగిన 11 గ్రామాలలో తప్పొప్పులను సరిచేస్తూ మరోసారి సర్వే ప్రారంభించాల్సిందిగా సర్వే, రెవెన్యూ సిబ్బందికి తహసీల్దార్ మహేశ్వరరావు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రత్యేక సమీక్షలో ఆయన మాట్లాడారు. మండలంలోని చినపాచిల, మత్స్యపురం, మచ్చవానిపాలెం, గుమ్మాళ్లపాడు, పెదపాచిల, జెడ్.కొత్తపట్నం, దిడ్డి, కానాడ, రావికమతం, గర్నికం, కొమిర గ్రామాలలో తొలివిడత రీసర్వే పూర్తయ్యిందన్నారు. అయితే సిబ్బంది తొందరపాటు వలన కొంత మంది రైతుల నుంచి అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. రైతుల భూ విస్తీర్ణంలో లోపాలు, ఆధార్ తదితర వివరాల తప్పుడు నమోదు, బ్యాంకు ఖాతాల నమోదులో తప్పులు దొర్లడంతో కొంత మంది రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. వాటిని పరిష్కరించాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం నుంచే రీసర్వే మరలా ప్రారంభించినట్టు వెల్లడించారు. ఇకపై తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని హెచ్చరించారు. రైతులకు దండోరా ద్వారా సమాచారం ముందుగా తెలియజేయాలన్నారు. రైతులు కూడా తమ వద్దనున్న ఆధారాలను సిబ్బందికి చూపాలని తహసీల్దార్ కోరారు.

ఉత్తమ ఫలితాలతో ఉన్నత భవిత



కె.కోటపాడులో విద్యార్థినులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ అనురాధ

కె.కోటపాడు : వసతిగృహాల్లో విద్యార్థినులు రానున్న పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులై, తల్లిదండ్రుల ఆకాంక్షల్ని నెరవేర్చాలని జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లె అనురాధ సూచించారు. కె.కోటపాడులోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఆమె సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ ఒత్తిడికి గురికాకుండా పరీక్షలను రాయాలని వారిలో ధైర్యం నింపారు. రాబోయే రోజుల్లో ఉన్నత ఉద్యోగ అవకాశాలను పొందేందుకు పరీక్షల్లో సాధించిన ఫలితాలే దోహదపడతాయని విద్యార్థినులకు వివరించారు. అనంతరం వసతిగృహంలో సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాల్సిందిగా సిబ్బందిని సూచించారు.

27 వేల జీవాలకు గాలికుంటు టీకాలు

మాకవరపాలెం: కోటవురట్ల క్లస్టర్ పరిధిలో 27 వేల పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్టు పశుసంవర్ధకశాఖ ఏడీ సింహాద్రప్పడు తెలిపారు. మండలంలోని సుభద్రయ్యపాలెంలో సోమవారం గాలికుంటు టీకాలు వేసేందుకు మెగా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాకవరపాలెం, కోటవురట్ల మండలాల్లో ఈ నెల 31 వరకు టీకాలు వేస్తామన్నారు. ఈ వ్యాధి సోకితే పశువులు బలహీన పడటంతోపాటు, పాల దిగుబడి తగ్గిపోతుందని, కొన్నిసార్లు జీవాలు



టీకాలు వేస్తున్న ఏడీ, పశువైద్య సిబ్బంది

మరణించే ప్రమాదముందన్నారు. రైతులు నిర్లక్ష్యం వహించకుండా తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో రాచపల్లి ఇన్‌చార్జి వైద్యుడు ప్రతాప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో రోగుల్ని పరీక్షిస్తున్న వైద్యులు

బుచ్చెయ్యపేట : మండలంలోని ఆర్ భీమవరంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 124 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశాలతో సర్పంచ్ బల్లిన మాధవి, పార్టీ గ్రామాధ్యక్షుడు బల్లిన అమ్మునాయుడుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విజన్ ఐ కేర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది రోగులను పరీక్షించారు. 18 మందికి తీవ్ర కంటి చూపు సమస్య ఉండటంతో శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అవసరమైన వారికి కళ్లద్దాలు, మందులు అందించారు. చిన భీమవరం, ఎంబీ పాలెం, శివరాంపురం తదితర గ్రామాల రోగులు వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు సేనాపతి నాయుడు, నాయకులు పల్లెల ఈశ్వరరావు, రొంగలి చిన్నంనాయుడు, పల్లె సన్నిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

మాడుగుల : స్థానిక నూకాలమ్మ కాలనీలో వెలసిన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వార్షికోత్సవంలో భాగంగా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీ పాలిమేర విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాలిమేర చిన్నారావు, శేనాపతి గంగాధర్, ఎడ్ల



వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకుంటున్న ఎంపీపీ రామధర్మజ, స్థానిక నాయకులు

హేమంత్ కుమార్, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవ కమిటీ ఎన్నిక




మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ నూతన ఉత్సవ కమిటీని సోమవారం లాటరీ పద్ధతిలో ఎన్నుకున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, ఉపసర్పంచ్ శ్రీనాదు శ్రీనువాసరావు ఆధ్వర్యంలో 200 దరఖాస్తులురాగా వార్డుకు ఒకరు చొప్పున 16 మందిని ఎంపిక చేసినట్టు వెల్లడించారు. ఈ కమిటీ సభ్యులు రెండేళ్లపాటు కొనసాగనున్నట్టు పేర్కొన్నారు.

రూ.20 లక్షల బీమా అందజేత

రోలుగుంట : మండలంలో శరభవరం గ్రామానికి చెందిన కలిగట్ల సూర్యనారాయణ గతేడాది సెప్టెంబర్లో పొలానికి వెళ్లి మోటారు ఆన్ చేసే సమయంలో విద్యుదాఘాతానికి గురై మరణించాడు. మృతుడు అంతకు ముందు ఏపీజీవీబీలో ఏటా రూ.1000తో సాధారణ బీమా చేయించుకున్నాడు. ప్రమాదవశాత్తూ మరణించడంతో అతనికి బీమా వర్తించి రూ.20 లక్షలు మంజూరైంది. ఆ చెక్‌ను అనకాపల్లి జిల్లా రీజనల్ మేనేజర్ ఈ గ్రామంలావాదీవీలు జరుపుతున్న నర్సీపట్నం బ్రాంచ్‌మేనేజర్ దుప్పాడ గణేష్‌తో కలసి సోమవారం మృతుడి నామినీ ఆయిన అతని తండ్రి వెంకునాయుడికి గ్రామ పెద్ద దోసపత్ని రాజు సమక్షంలో అందించారు. కార్యక్రమంలో స్థానిక నోడల్ అధికారి పాల్గొన్నారు.

విద్యార్థులతో గణిత క్లబ్‌ల ఏర్పాటు



గణితంలో సులువైన పద్ధతులపై విద్యార్థుల ప్రదర్శన

మాకవరపాలెం : గణితంలో మెళకువలు నేర్పించేందుకు గణిత క్లబ్‌లు ఏర్పాటు చేసినట్టు పైడిపాల ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కె.రాము తెలిపారు. ఈ పాఠశాలలో సోమవారం 6, 7 తరగతుల విద్యార్థులతో గణిత క్లబ్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణితంలో వివిధ రకాల పజిల్స్, ఈజీ క్యాలిక్యులేషన్స్, సలువుగా గుణకారాలు చేసే పద్ధతులను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రాము మాట్లాడుతూ ఇలాంటి క్లబ్‌ల ఏర్పాటుతో గణితం పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందన్నారు.